ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- పురపాలక పరిపాలన శాఖ కమిషనర్, డైరెక్టర్ టీకే శ్రీదేవి
- తడి, పొడి చెత్త విభజన తదితర అంశాలపై సమీక్ష

మున్సిపల్ పరిధిలోని పార్క్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న సీడీఎంఏ డైరెక్టర్ టీకే శ్రీదేవి

కొడంగల్, జూన్ 10 : ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయ్యేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పురపాలక పరిపాలన కమిషనర్, డైరెక్టర్ టీకే శ్రీదేవి తెలిపారు. మంగళవారం కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, తడి, పొడి చెత్త విభజనపై ఇంటింటికీ అవగాహన, ఆరోగ్య శిబిరాల నిర్వహణ, మురుగు కాల్వల్లో పూడికతీత పనులు తదితర అంశాలపై కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ఆమె కడా కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణాన్ని పరిరక్షించలేకపోతున్నామన్నారు. మహిళా స్వయం సంఘాల సభ్యులతో టెంట్ హౌస్‌లను ఏర్పాటు చేయించి ప్లాస్టిక్‌కు సంబంధించిన సామగ్రి సరఫరా లేకుండా శుభకార్యాలను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వాడాల్సిన వస్తువులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మురుగు కాల్వల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయించి శుభ్రంగా ఉండేలా పారిశుధ్య పనులు చేయించాలని అధికారులకు సూచించారు. దోమల బెడద నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక శిబిరాల నిర్వహించాలన్నారు. కొడంగల్‌ను సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దే దిశగా ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మంజూరైన పనులను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అలాగే మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేయించాలన్నారు. అంతకు ముందు మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న పార్కులో అధికారులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. పట్టణ కేంద్రంలోని జీఎన్ లాహోటి కాలనీలోని పార్క్, పట్టణ ప్రకృతి వనంతో పాటు అమృత్ 2.0 నీటి సరఫరా పథకం కింద నిర్మాణం చేస్తున్న ట్యాంకు పనులను పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఎంఏయూడీ జాయింట్ డైరెక్టర్ పల్గుణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. - వికారాబాద్, జూన్ 10

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. - కొడంగల్, జూన్ 10

పండుగలా పాఠశాలల పునః ప్రారంభోత్సవం

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఆదిబట్ల, జూన్ 10 : పాఠశాలల పునః ప్రారంభోత్సవం పండుగలా నిర్వహించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బడిబాట, వన మహోత్సవం, ఇందిరా మహిళా శక్తి తదితర అంశాలపై మంగళవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలకు తోరణాలు కట్టి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్వాగతం పలకాలన్నారు. వారం పాటు నిర్వహించిన బడిబాటలో గుర్తించిన బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం దుస్తులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభోత్సవం రోజు పిల్లలు, వారి తల్లిదండ్రులు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 12 నుంచి 16 వరకు అంగన్‌వాడీ బడిబాట నిర్వహించాలన్నారు. వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి పథకంపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఈవో సుశీందర్‌రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జూన్ 10 : వసతి గృహాల్లోని పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఎం.సుధీర్ సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నూతనంగా ఎంపికైన ఎనిమిది మంది వసతి గృహ సంక్షేమ అధికారులకు మంగళవారం తన చాంబర్‌లో శిక్షణలో భాగంగా వసతి గృహ నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యంపై విధి నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరిస్తూ వసతి గృహ విద్యార్థులకు ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా భోజన సౌకర్యం అందించాలని తెలిపారు. మెనూ, ఆహార పదార్థాల నిల్వలు తదితర వివరాలు ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. వసతి గృహాలకు విద్యాశాఖతో అనుసరించాల్సిన విషయాలపై డీఈవో ఇచ్చే సూచనలను పాటించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని సంప్రదిస్తూ ఉండాలన్నారు. ఆర్థిక నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణపై ట్రెజరీ అధికారుల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. వసతి గృహాల పరిపాలనపై సంక్షేమ అధికారుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. శిక్షణలో డీటీడీవో కమలాకర్ రెడ్డి, డీబీసీడీవో ఉపేందర్, డీఈవో రేణుకా దేవి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీటీవో జర్సన్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖకు ఇద్దరు, సాంఘిక సంక్షేమ శాఖకు ముగ్గు రు, బీసీ సంక్షేమ శాఖకు ముగ్గురు కేటాయించిన వసతి గృహ అధికారులు శిక్షణలో పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా సంక్షేమ అధికారి జయసుధ

వికారాబాద్, జూన్ 10 : అర్హులైన దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి జయసుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ద్వారా దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి పరికరాలు, లెర్నింగ్ మెటీరియల్, ఎం ఆర్సీ చప్పల్స్ ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. శారీరక దివ్యాంగులు, అంధులు, బధిరులు, మానసిక ది వ్యాంగులకు రెట్రోఫిట్టెడ్ మోటరైజ్ వెహికల్స్, బ్యాటరీ వీల్ చైర్స్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్స్, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికల్స్, హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్‌మెంట్, వీల్ చైర్, ల్యాప్‌టాప్స్, ట్యాబ్స్, 4జీ స్మార్ట్‌ఫోన్స్, ట్రై సైకిల్స్, క్యాలిపర్స్, ఆర్టిఫిషియల్ లింబ్స్, క్రచె స్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్ కేన్స్, బ్రెయిలీ బుక్స్, బ్రెయిలీ కిట్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్, ఎంఆర్సీ చప్పల్స్ ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. : https://tgobmms.cgg.gov.in//వెబ్‌సైట్‌లో అన్ని ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 18 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించి నియమ నిబంధనల మేరకు అర్హత ఉన్న దివ్యాంగులను ఎంపిక చే స్తారన్నారు. అర్హతలు, నిబంధనల వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నా రు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమ శాఖాధికారి కార్యాలయం 81794 32874 నంబర్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

పరిశీలించాలి.. పరిష్కరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- రావులపల్లిలో రెవెన్యూ సదస్సు ఆకస్మిక సందర్శన

రావులపల్లిలోని రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, జూన్ 10 : రెవెన్యూ సదస్సుల్లో ఇస్తున్న దరఖాస్తులను పరిశీలించి.. వెంటనే పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రావులపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను స్వయంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా? అని అధికారులను అడిగారు. వివరాల నమోదులో తప్పిదాలు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్కులు, రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజలు ఇచ్చే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్నారు. దరఖాస్తుదారులను మళ్లీ మళ్లీ తిప్పుకోరాదని, సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే వారితో సున్నితంగా వ్యవహరించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల పరిష్కార వేదికలుగా రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన బస్ పాస్ చార్జీలను తగ్గించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజుకుమార్ గౌడ్

కొడంగల్, జూన్ 10: తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థుల బస్ పాస్ చార్జీలను 20 శాతం పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజుకుమార్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే గతంలో పెంచిన బస్ చార్జీలు, స్టూడెంట్స్ పాస్ చార్జీల కారణంగా గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మళ్లీ 20 శాతం చార్జీలు పెంచి అమలు చేస్తే బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రధానంగా ఉన్నత విద్య కోసం బస్‌లో ప్రయాణించే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ చదువుకు దూరమయ్యే పరిస్థితి వస్తుందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే చాలా రూట్లలో విద్యార్థుల కోసం బస్సులు నడపడం లేదన్నారు. బస్సుల సంఖ్య పెంచి, ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ వస్తున్న నేపథ్యంలో చార్జీలు, బస్ పాసుల ధరల పెంపు నిర్ణయం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. తక్షణమే బస్సు పాసల చార్జీల పెంపు నిర్ణయాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని డిపోల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు

యువజన, క్రీడల శాఖ జిల్లా అధికారి ఎంఏ సత్తార్

వికారాబాద్, జూన్ 10 : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని యువజన, క్రీడల శాఖ జిల్లా అధికారి ఎంఏ సత్తార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హకీంపేట్, కరీంనగర్, అదిలాబాద్‌లో ఉన్న క్రీడా పాఠశాలలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుందన్నారు.ఈ నెల 16 నుంచి 19 వరకు మండల స్థాయి ఎంపిక నిర్వహిస్తారని తెలిపారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 23 నుంచి 25 జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తారని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి జూలై ఒకటో తేదీ నుంచి 5 వరకు రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు. హకీంపేటలో బాలురకు 20, బాలికలకు 20 సీట్లు, కరీంనగర్‌లో బాలురకు 20, బాలికలకు 20 సీట్లు, అదిలాబాద్‌లో బాలురకు 20, బాలికలకు 20 సీట్లు ఉన్నాయని తెలిపారు. మొత్తం 120 సీట్లకు ఈ ఎంపిక జరుగుతుందన్నారు. 2016 సెప్టెంబర్ ఒకటి నుంచి 2017 ఆగస్టు 30 మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. 8 నుంచి 9 ఏండ్ల వారు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. ఈ నెల 7నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. మొబైల్ ద్వారా tgss.telangana.gov.inలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఒక ప్రత్యేక క్యూఆర్ కోడ్ ను కూడా రూపొందించి విద్యార్థినీవిద్యార్థులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. మరింత సమాచారం కోసం పరీక్షలు నిర్వహించే తేదీ, ప్రదేశం, ఇతర వివరాలకు సంబంధిత జిల్లా క్రీడా, యువజన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

మొరం పనులు నిలిపివేత

బషీరాబాద్, జూన్ 10 : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరాన్ని తరలిస్తున్నారనే కథనాన్ని 'నమస్తే తెలంగాణ'లో సోమవారం గుట్టను తవ్వేస్తున్నారని ప్రచురితం చేయడంతో అధికారులు స్పందించి మొరం పనులను నిలిపివేశారు. తహసీల్దార్ సాహిదా బేగం స్పందించి మంగళవారం ఆర్ఐ శివ చరణ్‌ను నీళ్లపల్లి గ్రామానికి పంపించి విచారణ జరిపించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్, ఇటాచీ తళలను తహసీల్దార్ కార్యాలయానికి తెప్పించుకున్నారు. అనుమతులు లేకుండా మొరం తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయిస్తామన్నారు.

ఎర్రమట్టిని తరలిస్తున్న వాహనాల పట్టివేత

యాజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు

సోలీపేట్‌లో ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న ప్రదేశాన్ని సందర్శిస్తున్న తహసీల్దార్ ఎండీ అన్వర్

షాబాద్, జూన్ 10: అర్ధరాత్రి గట్టుచప్పుడు కాకుండా ఎర్రమట్టిని తరలిస్తున్న వాహనాలను రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. మంగళవారం షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొంత మంది వ్యాపారులు సులభంగా డబ్బులు సంపాదించేందుకు అలవాటు పడి ప్రభుత్వ భూముల్లోని ఎర్ర మట్టిని అక్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకుంటూ డబ్బులు దండుకుంటున్నారని తెలిపారు. షాబాద్ మండల పరిధిలోని సోలీపేట్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 350లో ఉన్న 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొందరూ అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారని పక్కా సమాచారం రావడంతో సోమవారం అర్ధరాత్రి 11గంటల సమయంలో తహసీల్దార్ తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి దాడులు నిర్వహించారు. సుమారు మూడు, నాలుగు చోట్ల 10 టిప్పర్లు, 2 జేసీబీలు మట్టి తవ్వుతుండగా, వాటిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా 10 టిప్పర్లు, ఒక జేసీబీ పట్టుబడింది. మరోక జేసీబీని అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయారు. ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి సమయంలో అక్రమంగా మట్టి వ్యాపారం చేస్తున్న ముగ్గురు యజమానులు, పది మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. 15-20 ఫీట్ల వరకు పెద్ద పెద్ద గుంతలు తీసి మట్టిని తవ్వుతున్నారని చెప్పారు. ప్రభుత్వ భూమి హక్కుదారులకు డబ్బు ఆశ చూపించి వారి నుంచి భూమిని తీసుకుని అందులో మట్టి తీసి కంపెనీలకు అమ్ముకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి ఘటనలు ఎక్కడ జరిగినా సహించేది లేదని, ఎంతటివారైనా నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే ఈసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు కూడా తమ దృష్టికి వచ్చిందని, దానిపై కూడా నిఘా పెట్టామని, త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎస్సై రమేశ్, ఆర్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

లా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేండ్ల ఎల్ఎల్బీ, మూడేండ్ల ఎల్ఎల్బీ ఆనర్స్, ఐదేండ్ల బీఏ ఎల్ఎల్బీ, ఐదేండ్ల బీబీఏ ఎల్ఎల్బీ, ఐదేండ్ల బీకాం ఎల్ఎల్బీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కుల మెమోలను సంబంధిత కళాశాల నుంచి ఈ నెల 20వ తేదీ తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 20లోగా, రూ.200 అపరాధ రుసుముతో 24వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరు వారు ఒక్కో పేపర్‌కు రూ. 1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 9వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ లో చూసుకోవాలని సూచించారు.

విదేశీ భాషల డిప్లొమా కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని విదేశీ భాషల డిప్లొమా కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ జర్మన్, పీజీ డిప్లొమా ఇన్ ఫ్రెంచ్ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేశామన్నారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీఈ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల చివరి సెమిస్టర్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ సీబీసీఎస్, బీఈ నాన్ సీబీసీఎస్, బీఈ ఏఐసీటీఈ కోర్సుల చివరి సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, వన్ టైం చాన్స్ పరీక్షలను ఈ నెల 25 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో పరీక్ష తేదీల వివరాలు చూసుకోవాలని సూచించారు.

వేధిస్తే..షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయండి

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): ఇంటి యజమానికి 73 ఏండ్లు... తన ఇంట్లో కిరాయికి ఉన్న వారితో కలివిడిగా ఉంటాడు.... ఇంట్లో అందరు ఉన్నప్పుడు రాముడిలా...బాలిక ఉన్నప్పుడు మాత్రం రాక్షసుడిగా మారిపోతూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు...అతని పిచ్చి చేష్టలపై తల్లిదండ్రులకు చెప్పినా... అతడు రాముడంటూ బాలికపైనే కసురుకునేవారు.. ఇలా మూడేండ్లుగా ఆ ఇంటి యజమాని వేధిస్తుండడంతో.. బాలిక అతడి చేష్టలను ఒక రోజు సెల్‌ఫోన్‌లో రహస్యంగా రికార్డు చేసి తల్లిదండ్రులకు చూపించడంతో... కంగుతిని రాచకొండ షీ టీమ్స్‌ను ఆశ్రయించారు. దీంతో ఆ వృద్ధుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలా మహిళలు, యువతులు, బాలికలను వేధింపులకు గురిచేస్తున్న పోకిరీలు, క్రిమినల్స్‌ను ఆయా కేసుల తీవ్రతను బట్టి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ.. క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారు. గత నెలలో పట్టుబడిన పోకిరీలకు మంగళవారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీల్లో తిరుగుతూ షీ టీమ్స్ సిబ్బంది డెకాయి ఆపరేషన్ చేస్తున్నారని తెలిపారు. బాలికలు, మహిళలు, యువతులను వేధించే పోకిరీలను ఎట్టి పరిస్థితుల్లోను వదిలిపెట్టేది లేదని, మహిళలు నిర్భయంగా షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. పట్టుబడిన పోకిరీలను వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషారాణి మాట్లాడుతూ.. గత నెలలో 240 మందిలో 160 మంది మేజర్లు, 80 మంది మైనర్లు ఉన్నట్లు తెలిపారు. గత నెలలో షీ టీమ్స్‌కు 288 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫోన్ల ద్వారా వేధింపులు 42, సోషల్‌మీడియా యాప్స్ ద్వారా 102, నేరుగా వేధింపులకు సంబంధించిన కేసుల ఫిర్యాదులు 144, అందులో 18 క్రిమినల్ కేసులు, 122 పెట్టీ కేసులు, 110 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీసీపీ వివరించారు.

ప్రేమించకపోయిన ఫర్వాలేదు.. ఓయో రూమ్‌కు రా..

ఓ యువతి క్రికెట్ శిక్షణ పొందుతుంది. అదే శిక్షణ సంస్థలో ఉన్న మరో యువకుడు ఆమెతో అప్పుడప్పుడు మాట్లాడుతుండేవాడు. ఇదే అదనుగా ఆమెతో స్నేహం చేసినట్లు నటిస్తూ ప్రేమిస్తున్నానంటూ చెప్పగా.. ఆమె అతడి ప్రతిపాదనను తిరస్కరించి దూరంగా ఉంటుంది. నీవు ప్రేమించకపోయిన పర్వాలేదు.. ఓయో రూమ్‌కు రా.. ! లేకుంటే.. క్రికెట్ ఆడుతున్న సమయంలో దిగిన ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో పెడుతానంటూ బెదిరింపులకు దిగాడు.. దీంతో బాధితురాలు షీ టీమ్స్‌ను ఆశ్రయించడంతో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు.

లూడో గేమ్‌తో పరిచయం.. ఆపై బ్లాక్‌మెయిలింగ్

బాలికకు ఆన్‌లైన్‌లో లూడో అడుతుండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి పరిచయం అయ్యాడు. తరువాత ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వివరాలు తెలుసుకొని బాధితురాలికి తరచూ మెసేజ్ పెడుతున్నాడు. అతని ప్రవర్తనపై అనుమానం రావడంతో కొన్నాళ్ల నుంచి మాట్లాడడం లేదు.. తనతో మాట్లాడకపోతే నీ వీడియోలు, ఫొటోలు నా వద్ద ఉన్నాయంటూ బ్లాక్‌మెయిలింగ్‌కు దిగడంతో బాధితురాలు షీ టీమ్స్‌ను ఆశ్రయించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

బీఎంఎస్ ఆటోట్యాక్సీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందకిషోర్

రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

శంషాబాద్ రూరల్, జూన్ 10: రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఎంఎస్ ఆటో ట్యాక్సీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిషోర్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుచేసి ఆటోడ్రైవర్ల జీవితాలను రోడ్డున పడవేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో తమ సమస్యలను పరిష్కారించాలని ఆందోళన చేయడంతో దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12వేల రూపాయల ఇస్తానని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఒక్కరూపాయి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.12వేల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సయ్యద్, ఆర్‌వీఎల్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పవన్‌కుమార్, మల్లేశ్, రాఘవేందర్, జగదీష్‌చారి, మహేష్, శివ, గౌస్‌పాషా, సాయి తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఖైరతాబాద్, జూన్ 10: దేశానికి భావిభారత సైనికులను అందించేందుకు తెలంగాణ రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణారెడ్డి మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయకపోవడంతో ఇక్కడి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ విద్యార్థులు ప్రస్తుత ఏపీ రాష్ట్రంలోని కోరుకొండ, కలికిరి సైనిక్ స్కూళ్లలో పదేళ్లపాటు ప్రైవేట్ విద్యార్థులుగా అడ్మిషన్లు పొంది చదువును పూర్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే ఇటీవల తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు నాన్ లోకల్ అంటూ ఏపీకి చెందిన సైనిక్ స్కూల్ సర్క్యులర్ జారీ చేయడంతో ఇక్కడి విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలోనూ సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి సైనిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ సైనిక పాఠశాల పేరెంట్స్ అసోసియేసన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాము సాగర్, ఐలయ్య, పోచయ్య ముదిరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.